




## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

# "నాన్న తన కూతుళ్ళతో"

పిల్లలు ఎదిగే క్రమాన్ని చూడటం తలిదండ్రులకు ఆసక్తికరంగా ఉంటుంది. వాళ్ళు అవగాహన, శక్తి  సామర్థ్యాలు క్రమంగా పెంపొందించుకోవటం, తమనుంచి విడివడి స్వతంత్ర జీవనం గడపటానికి కావలసిన వనరుల్ని ఒకటొకటిగా సమకూర్చుకోవటం చూస్తుంటే తలిదండ్రులకు వింతగానూ, ఆనందంగానూ ఉంటుంది. దీనికి మరో ప్రక్క పిల్లలు గమనించే పరిణామం కూడా ఉంటుంది. అది తమ తల్లిదండ్రులు వయసుమళ్ళి, క్రమంగా వృద్ధులు కావటం. ఒకటి ఉదయార్కుడు పురోగమించి నింగి మధ్యకి చేరటమైతే, మరొకటి ప్రచండంగా వెలిగిన సూర్యుడు నెమ్మదిగా చల్లబడి పడమటివైపుకు జారటం. ఈ రెండవ పరిణామం గురించి శ్రీకాంత్ రాసిన కవిత "నాన్న తన కూతుళ్ళతో". ఈయన మొదటి కవితాసంకలనం "కొన్ని సమయాలు" లో ఉన్న అనేక మంచి కవితల్లో ఇది కూడా ఒకటి.

కవిత నిర్వహణలో, వాక్య నిర్మాణంలో శ్రీకాంత్ అనుసరించే శైలి భిన్నంగా ఉంటుంది. ఈయన కవితలు చదువుతోంటే, అప్పుడప్పుడు అనువాద కవితలు చదువుతున్నట్టుగా మనకనిపిస్తుంది. ఒకోసారి, ఈ కవి వేరే భాషలో ఆలోచించి, తెలుగులో కవిత్వం రాస్తున్నాడా అని అనుమానం కలగుతుంది. ఐతే, ఇది ఆయన ప్రయత్నపూర్వకంగా అనుసరించిన వ్యూహమేననుకుంటాను. పొడుగైన వాక్యాలతో, ఎప్పుడూ ఎదుటివాడితో సంభాషిస్తున్నట్టు సాగే ఈ కవితలు కవి ఆశించిన మానసికస్థితి లోనికి పాఠకుణ్ణి తీసుకువెళతాయి.

కళ్ళు మిరుమిట్లు గొలిపే అలంకారాలకంటే, లోతైన ఆలోచన, కవి పరిశీలనా పటిమను ప్రతిబింబించే పదచిత్రాలు ఈ కవితలకు ప్రాణంగా నిలుస్తాయి.

ఈకవితలో మూడు ప్రధానమైన అంశాలున్నాయి. ఒకటి, తండ్రి క్రమంగా వృద్ధుడయే పరిణామాన్ని చెప్పటం, రెండు తన తండ్రిని ఒక పరంపరలో భాగంగా గుర్తించటం, మూడు తండ్రిపై తనకు, మరీ ముఖ్యంగా తన తోబుట్టువులకు ఉన్న ప్రేమని తెలియజెప్పటం. ఈ క్రింది వాక్యాలు పరిణామాన్ని ప్రతిభావంతంగా వర్ణిస్తాయి: కొన్ని ఆకులు రాలతాయి కిటికీ వలలోంచి; అవి నీ తండ్రి ముఖంపై తార్లాటలాడుతాయి; ముఖంపై ఏర్పడుతున్న మడతల్ని ప్రకాశింపజేస్తూ: సూర్యకిరణాలు.

తాతని, తండ్రిని, తనను ఒక పరంపరలో భాగంగా గుర్తించటం, తరం నుంచి తరానికి అనుభవాలు పరిపక్వమౌతాయని చెప్పటం చాలా సమంజసమైన విషయాలు.

నా తండ్రి దేహంలో అతడి తండ్రి జీవితాన్ని చూస్తాను. మరి నా దేహంలో, నా తండ్రి తనను తాను గమనిస్తాడా? తప్పక గమనిస్తాడనుకుంటాను. పోలికలు, అలవాట్ల ద్వారా ఏర్పడే కొనసాగింపుని ప్రతితరం తన ముందరి, తరువాతి తరాల్లో గమనిస్తూనేఉంటుంది. ఈ పరంపరవల్లనే మనిషి తన జీవితాన్ని దాటి అనేకతరాలు జీవించగలుగుతాడు. తండ్రిపై ఉన్న ప్రేమను సున్నితంగా వ్యక్తంచెయ్యటం ఈ

కవితలో మరొక కోణం. తండ్రి పాత్రను పొగడటం కాకుండా, ఒక పసిపిల్లవాడిలా, పిల్లలచేత లాలించబడే వాడిగా తండ్రిని చూపించటంవల్ల, ఈ వర్ణన చుట్టూ ఒక ఆర్ద్రత ఏర్పడింది.

తన తల్లి త్వరగా మరణించినందుకు కామోసు ఇప్పుడు ముగ్గురు కూతుళ్ళు ముగ్గురు అమ్మల్లా ఒకే అమ్మయి అతడ్ని కూర్చోబెట్టి భోజనం పెడుతుంటారు మారాంజేసే -బాల్యం బాల్యంలా కాక కఠినంగా శ్రమిస్తూ గడిపిన - నా తండ్రికి బుజ్జగిస్తూ, మందలిస్తూ ప్రేమిస్తూ- తండ్రిని వస్తువుగా చేసుకొని వచ్చిన మంచి కవితల్లో ఈ కవిత కూడా పేర్కొనదగింది.

కవిత పూర్తి పాఠం:

యీ రోజు యింతకుమునుపే చూసావు -
నీ తండ్రి
నీ ఎదురుగా కూర్చుని
వృద్ధుడిలా మారే రోజులు

కొన్ని ఆకులు రాలతాయి
కిటికీ వలలోంచి; అవినీ తండ్రి ముఖంపై
తార్లాటలాడుతాయి; ముఖంపై ఏర్పడుతున్న మడతల్ని
ప్రకాశింపజేస్తూ: సూర్యకిరణాలు.

అతడు కథలను మోసుకొని తిరిగే వ్యక్తి. తన
తండ్రి నుంచి ఏరుకొచ్చినవి, బహు జాగ్రత్తగా
విడమర్చి చెబుతాడు: నాకు తన తండ్రి తనకు
మరో సమయంలో చెప్పినట్టుగా -

బహుశా, అనుభవాలు తరం నుంచి తరానికి పరిపక్వం చెందుతాయి
నా తండ్రి తండ్రి నుంచి నాదాకా; కథలంటే మరేమీ కావు.
మట్టి; వానలో నానిన మట్టి వేళ్ళ మొక్కలను విత్తనాలతో నాటడం
రాత్రిపూట లాంతరు వెలుగులో కుక్కి మంచంపై తండ్రికాళ్ళపై కూర్చుని
భూమి గాథలను వినడం, ఆపై
పశువులూ పొలం ధరిత్రీ కలగలిపిన గాలి వాసనను పీల్చడం, అప్పుడప్పుడూ
వర్షం పడినప్పుడు శెనగలు వేయించుకుని తినడం. నా తండ్రి దేహంలో
నా తండ్రిదేహంలో అతడి తండ్రి జీవితాన్ని చూస్తాను. మరి నా దేహంలో, నా తండ్రి
తనను తాను గమనిస్తాడా? ఏమో, కానీ ప్రస్తుతానికి

అతడు
తన ముగ్గురు తల్లులతో విశ్రమిస్తున్నాడు
తన తల్లి త్వరగా మరణించినందుకు కామోసు
ఇప్పుడు ముగ్గురు కూతుళ్ళు ముగ్గురు అమ్మల్లా ఒకే అమ్మయి
అతడ్ని కూర్చోబెట్టి భోజనం పెడుతుంటారు మారాంజేసే -బాల్యం బాల్యంలా కాక
కఠినంగా శ్రమిస్తూ గడిపిన - నా తండ్రికి
బుజ్జగిస్తూ, మందలిస్తూ ప్రేమిస్తూ -

- శ్రీకాంత్

✡✡✡

(శ్రీకాంత్ ప్రముఖకవి శ్రీ కె.శివారెడ్డి గారి కుమారుడు. "కొన్ని సమయాలు", "ఇతర" అనే కవితా సంకలనాలు వెలువరించారు. హైదరాబాదులోని **'CIEFL'**లో లెక్చరరుగా పనిచేస్తున్నారు.)

